నాలుగేళ్లలో నారాయణ కనిపించారా?

- జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి
- సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్ కుమార్



లబ్ధిదారుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్ కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): '2019 ఎన్నికల తర్వాత నారాయణ ఎప్పుడైనా కనిపించారా?, ఓట్లు వేసిన వారి గురించి ఈ నాలుగు సంవత్సరాలు ఆయన పట్టించుకోలేదు. కరోనా మహమ్మారి సమయంలో.. వరదలు వచ్చినప్పుడు కనిపించలేదు. 2024 ఎన్నికల నేపథ్యంలో ప్రజలంతా ఈ విషయాలపై ఆలోచించాలి.' అని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్ కుమార్ అన్నారు. పదో డివిజన్‌కు సంబంధించి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నగరంలోని రామచంద్రాపురం శ్రీదేవి రైస్‌మిల్లు వద్ద శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పథకాలు అందకుంటే ఆ పార్టీ నాయకుల వద్దకు వెళ్లి అడగాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ నేరుగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. స్థానిక డివిజన్‌లో సుమారు రెండువేల కుటుంబాలకు పథకాలు వస్తున్నాయన్నారు.

మంచి పనులు చేస్తుంటే..

వలంటీర్లు అవసరమా?, సచివాలయాలు ఎందుకు? అంటూ కొందరు దారుణంగా మాట్లాడుతున్నారని, ఇది ఎంతవరకు సబబని అనిల్ ప్రశ్నించారు. ఆ వ్యవస్థలతో ప్రజలకు ఎంతో మంచి జరుగుతోందని, ఈ విషయాన్ని గుర్తించాలన్నారు. స్థానిక ప్రాంతంలో కాలువ నిర్మించాలని అనుకున్నామని, 18 అడుగులు తప్పనిసరిగా తవ్వాల్సి ఉండడంతో కొన్ని ఇళ్లు పడిపోయే పరిస్థితి ఉందన్నారు. ఈ నేపథ్యంలో కల్వర్టులు, రోడ్లు నిర్మించి అక్కడున్న 128 కుటుంబాలకు వచ్చే నెల పట్టాలిస్తామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు పథకాలు ఇస్తుంటే రాష్ట్రం మరో శ్రీలంక అవుతుందని ఇష్టానుసారంగా మాట్లాడిన నాయకులు ఎన్నికలు సమీపిస్తుండడంతో తాము ఐదు రెట్లు అధికంగా పథకాలు ఇస్తామని ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమవుతున్నారన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్, కార్పొరేటర్ కిన్నెర ప్రేమ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సంక్షేమ పథకాలు

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



ములుముడిలో సర్టిఫికెట్ అందజేస్తున్న అరుణమ్మ

నెల్లూరు రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేదలకు అండగా నిలిచాయని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. నెల్లూరు రూరల్ మండలంలోని ములుముడి గ్రామంలో సచివాలయం వద్ద శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో పరిష్కరించాలన్నారు. విజయ డైయిరీ చైర్మన్ రంగారెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు జగనన్న సురక్ష ద్వారా లబ్ధి చేకూరుతోందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, రూరల్ ఎంపీపీ విజయకుమార్, రూరల్ ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్, డిప్యూటీ తహసీల్దార్ గోపి, సర్పంచ్ కుండా కరుణాకర్, నాయకులు చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మస్తానయ్య యాదవ్, బండి చెంచయ్య, దండి మురళి తదితరులు పాల్గొన్నారు.

22, 34 డివిజన్లలో..

రూరల్ నియోజకవర్గ పరిధిలోని 22, 34 డివిజన్లలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమాల్లో కార్పొరేటర్లు విజయభాస్కర్‌రెడ్డి, ఫామిదా, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

53వ డివిజన్‌లో..

నగరంలోని 53వ డివిజన్ గాంధీ గిరిజన కాలనీలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. కమిషనర్ వికాస్ మర్మత్ మాట్లాడుతూ 1,500 సర్టిఫికెట్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, కార్పొరేటర్ దేవరకొండ సుజాత అశోక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సమావేశం

నెల్లూరు(బృందావనం): గ్లోబల్ తెలుగు క్రిస్టియన్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ఓ హోటల్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండర్, ప్రెసిడెంట్ రెవరెండ్ డాక్టర్ లివింగ్‌స్టన్ గద్దె మాట్లాడారు. మణిపూర్‌లో క్రైస్తవులపై జరిగిన అంశాలపై జాతీయస్థాయి నాయకులు చర్చించాలన్నారు. కార్యక్రమంలో జీటీసీఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రెవరెండ్, ప్రియనాథ్ రూపస్, రెవరెండ్ డేవిడ్ దయాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఆ పార్టీ నాయకుడు ఆనం జయకుమార్‌రెడ్డి శనివారం నెల్లూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వేమిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేశారు. – నెల్లూరు(దర్గామిట్ట)

క్రికెట్ సెలక్షన్ కమిటీ సభ్యుడిగా మలిరెడ్డి



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మాజీ రంజీ క్రికెట్ ప్లేయర్, సీనియర్ అడ్వొకేట్ మలిరెడ్డి కోటారెడ్డిని రాష్ట్ర జూనియర్ మెన్ క్రికెట్ సెలక్షన్ కమిటీ మెంబర్‌గా నియమిస్తూ ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్‌ఆర్ గోపీనాథ్‌రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కోటారెడ్డికి రాష్ట్ర అండర్–14, అండర్–16, అండర్–19 జట్ల ఎంపికల్లో, ఇంటర్ జోనల్ మ్యాచ్‌ల పరిశీలన నివేదికలను అందజేసే బాధ్యతలు అప్పగించారు.

కేకేఆర్ గౌతమ్‌లో ఎల్లో కలర్ డే



నెల్లూరు(టౌన్): మాగుంటలేవుట్‌లోని కేకేఆర్ గౌతమ్ స్కూల్లో శనివారం ఎల్లో కలర్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎల్లో కలర్ ఫ్రూట్స్, టాయ్స్‌తో పాఠశాలకు వచ్చారు. హెచ్‌ఎం శశికాంత్ ఎల్లో కలర్ విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో ఏఓ రమేష్ బాబు, టీచర్లు సుమతి, మౌనిక పాల్గొన్నారు.

మందుబాబులకు మూడురోజుల జైలుశిక్ష

నెల్లూరు(క్రైమ్): మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడిన పలువురు మందుబాబులకు మూడురోజుల జైలుశిక్ష విధిస్తూ శనివారం నెల్లూరులోని మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ లావణ్య తీర్పునిచ్చారు. వివరాలు.. ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాలతో నగర ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్ సుభాన్ పర్యవేక్షణలో నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మిద్దె నాగేశ్వరమ్మ తన సిబ్బందితో ఇటీవల నగరంలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న 12 మందిపై కేసులు నమోదు చేశారు. వారికి మూడురోజుల జైలుశిక్ష విధిస్తూ మేజిస్ట్రేట్ లావణ్య తీర్పునిచ్చారు. జైలుశిక్ష పడిన మందుబాబులను పోలీసు అధికారులు జిల్లా కేంద్ర కారాగారానికి తరలించారు.

అడవుల అభివృద్ధిపై దృష్టి



మాట్లాడుతున్న శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు(బారకాసు): అడవుల అభివృద్ధిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించినట్లు ముఖ్య అటవీ సంరక్షణాధికారి (సీసీఎఫ్) తెలిపారు. నెల్లూరు, ప్రకాశం, గిద్దలూరు డివిజన్ల టెరిటోరియల్ ఫారెస్ట్, సోషల్ ఫారెస్ట్ అధికారులతో శనివారం నగరంలోని జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సీసీఎఫ్ మాట్లాడుతూ ఆయా డివిజన్ల అటవీ శాఖ కార్యాలయాల పరిధిలో మొత్తం 17 నగరవనాలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. నెల్లూరు జిల్లాలో జామాయిల్ విక్రయాన్ని వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో నెల్లూరు జిల్లా డీఎఫ్‌ఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోల సంఘం అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

నెల్లూరు(పొగతోట): గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎ.సురేంద్రనాయుడు, ధారా వెంకటరమణయ్య ఎన్నికయ్యారు. శనివారం ఏపీఆర్‌ఎస్‌ఏ కార్యాలయంలో ఈ ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. సహాధ్యక్షుడిగా హజరత్తయ్య, ఉపాధ్యక్షులుగా సురేష్, తిరుమలరావు, ప్రసాద్, కోశాధికారిగా బి.పెంచలరావు, 17 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ఎస్‌ఈకి వినతి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా ఎస్‌ఈ వెంకటసుబ్బయ్యను శనివారం నెల్లూరులో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్, విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు కలిశారు. వివిధ అంశాలపై వినతిపత్రం అందజేశారు.

ఆర్థిక సాయం

నెల్లూరు(వేదాయపాళెం): రోడ్డు ప్రమాదంలో చేతిని కోల్పోయిన యువకుడు మస్తాన్‌కు టీ దుకాణం ఏర్పాటు చేసుకునేందుకు రూ.15 వేలు ఆర్థిక సాయం చేసినట్లు ప్యూర్ స్మైల్స్ సేవా సంస్థ చైర్మన్ షేక్ పర్వీన్ శనివారం తెలిపారు.

మహిళల ర్యాలీ

నెల్లూరు(వేదాయపాళెం): మణిపూర్‌లో జరిగిన హింసాకాండకు నిరసనగా స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో శనివారం గాంధీబొమ్మ సెంటర్‌లో మహిళలు నిరసన కార్యక్రమం చేపట్టారు. గాంధీ బొమ్మ సెంటర్ నుంచి ప్రారంభమైన నిరసన ర్యాలీ ఏసీ సెంటర్ మీదుగా సుందరయ్య విగ్రహం వరకు సాగింది. స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కార్యదర్శి కొండమ్మ మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలపై లైంగికదాడులు, హత్యలకు కేంద్రం, ఆ రాష్ట్ర ప్రభుత్వాలదే బాధ్యత అన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు లక్ష్మి రెడ్డి, ఇంకా శ్యామల, భువనేశ్వరి, రమణమ్మ, సండే మార్కెట్ నాయకులు శరవణ, సెంథిల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేయాలి

నెల్లూరు రూరల్: జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలను జిల్లాస్థాయి అడ్వయిజరీ కమిటీ సభ్యులు తనిఖీ చేయాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య ఆదేశించారు. నగరంలోని తన కార్యాలయంలో శనివారం లింగ నిర్ధారణ వ్యతిరేక కమిటీ సమావేశం నిర్వహించారు.

నారాయణలో శస్త్రచికిత్స

నెల్లూరు(బారకాసు): 15 సంవత్సరాలుగా పెరిగి ప్రాణాంతకంగా మారిన హెర్నియాకు నారాయణ ఆస్పత్రి వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. శనివారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రొఫెసర్ డాక్టర్ కేఎల్ సంపత్ వివరాలు వెల్లడించారు. సూళ్లూరుపేట కోళ్లమిట్టకు చెందిన చల్లప్ప అనే 72 సంవత్సరాల వయసున్న వృద్ధుడికి 50 సెం.మీ పొడవు, 20 సెం.మీ వెడల్పుతో పెద్ద హెర్నియా సంచిలాగా తయారైందన్నారు. ఆపరేషన్‌ను విజయవంతంగా చేశామన్నారు.

సంగీత, నృత్య పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం

నెల్లూరు(బృందావనం): ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న డాక్టర్ ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాలలో 2023–2024 విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ సి.జ్యోతిర్మయి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు వివరాలకు 0861 – 2328285, 90007 86599 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు 4కే రన్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): స్త్రీ, పురుషులకు ఆదివారం 4కే రన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆనం మహేష్‌కుమార్ రెడ్డి, కె.గురుప్రసాద్ శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఒలింపిక్ డే సందర్భంగా జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నుంచి వేదాయపాళెంలోని నల్లపురెడ్డి శ్రీనివాసులురెడ్డి బొమ్మ వద్దకు వెళ్లి తిరిగి స్టేడియానికి రావాలని తెలిపారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

నెల్లూరు(బారకాసు): రొట్టెల పండగ నేపథ్యంలో ఆత్మకూరు బస్టాండ్ పరిసరాల్లో వాహనాల అక్రమ పార్కింగ్‌లను తొలగించి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. శనివారం ఆయన ట్రాఫిక్ పోలీస్, టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆత్మకూరు బస్టాండ్ ఫ్లై ఓవర్ కింద అభివృద్ధి పనులను వేగవంతంగా చేయాలని ఆదేశించారు. అనంతరం బారాషాహీద్ దర్గాలో రొట్టెల పండగ ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ, పోలీస్, నగరపాలక సంస్థ అధికారులు, దర్గా కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ధర్నాకు తరలిరావాలని పిలుపు

నెల్లూరు(వేదాయపాళెం): ఈనెల 24వ తేదీన విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమానికి ముస్లిం, మైనార్టీలు తరలిరావాలని ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ పిలుపునిచ్చారు. బాలాజీనగర్‌లోని రామచంద్రారెడ్డి భవన్‌లో శనివారం ఆయన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. వక్ఫ్‌బోర్డు భూములను కాపాడాలన్నారు. సమావేశంలో ఆవాజ్ జిల్లా కమిటీ సభ్యులు రియాజ్, చాంద్ బాషా, ఫయాజ్, నజీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

నెల్లూరు(టౌన్): పొదలకూరు రోడ్డులోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శనివారం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, పోక్సో చట్టం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర వాటిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ మాట్లాడుతూ ఆడపిల్లలతో ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే వెంటనే తల్లిదండ్రులు లేదా ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ అనురాధ, జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్‌బాబు, ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిర్మయి, ఐసీపీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

దర్గాలో ఏర్పాట్ల పరిశీలన

నెల్లూరు(బృందావనం): బారాషహీద్ దర్గాలో ఈనెల 29 నుంచి జరుగనున్న రొట్టెల పండగకు సంబంధించిన ఏర్పాట్లను దర్గా పనుల ఇన్‌చార్జి పర్యవేక్షకుడు రియాజ్‌తో కలిసి శనివారం పరిశీలించినట్లు జిల్లా నూర్‌బాషా సంక్షేమ సంఘం అధ్యక్షుడు షేక్ కాలేషా తెలిపారు. నూర్‌బాషా సంఘీయులకు దర్గా కమిటీలో అవకాశం కల్పించడం జరుగుతుందంటూ హామీ ఇచ్చిన నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నూర్‌బాషా సంక్షేమ సంఘం నగర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ హుస్సేన్, షేక్ మౌలాలీ తదితరులు పాల్గొన్నారు.

చీటింగ్ కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): ఓ వ్యక్తిని మోసగించిన కేసులో ముగ్గురు వ్యక్తులపై దర్గామిట్ట పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. సరస్వతి నగర్ భగత్ పాళెంలో విశ్రాంత పోలీస్ అధికారి కేవీ నారాయణ నివాసం ఉంటున్నారు. జీజీహెచ్‌లో పనిచేస్తున్న మురళి అతడికి స్నేహితుడు. ఈ ఏడాది మార్చిలో మురళి ఓ వ్యక్తితో కలిసి కారులో నారాయణ ఇంటికి వచ్చారు. మురళి తనతోపాటు వచ్చిన వ్యక్తి పి.శ్రీనివాసులు అని అతడి భార్యకు ఆరోగ్యం బాగోలేనందున కారును కుదువ పెట్టుకుని రూ.2.50 లక్షలు ఇవ్వాలని కోరారు. దీంతో నారాయణ రూ.2.50 లక్షలిచ్చి కారును స్వాధీనం చేసుకున్నారు. సదరు కారును తన ఇంటికి సమీపంలోని ఓ కార్యాలయం ముందు పార్క్ చేశాడు. ఈ క్రమంలో నారాయణకు ఓ వ్యక్తి ఫోన్ చేసి తన పేరు పి.శ్రీనివాసులు అని, కుదువ పెట్టుకున్న కారు తనదేనని చెప్పాడు. మురళి, అతని స్నేహితుడు పదిరోజుల క్రితం తన కారును బాడుగకు తీసుకెళ్లారని అప్పటి నుంచి వారు ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని, జీపీఎస్ ద్వారా కారు మీ ఆధీనంలో ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. దీంతో నారాయణ జరిగిన విషయాన్ని తన స్నేహితుడైన మోషేకు తెలియజేశారు. దీంతో మోసపోయానని నారాయణ గ్రహించారు. ఈ క్రమంలో ఉపాధ్యాయుడు బ్రహ్మయ్య అతని స్వాధీనంలో ఉన్న కారు తనదంటూ దొంగతనంగా తీసుకెళ్లాడు. తనను మోసపూరిత మాటలతో మోసగించిన మురళి అతని స్నేహితుడు, తనకు తెలియకుండా కారును తీసుకెళ్లిన బ్రహ్మయ్యపై శనివారం బాధితుడు దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ వస్తేనే ప్రజలకు న్యాయం

- మాజీ ఎంపీ చింతా మోహన్

నెల్లూరు సిటీ: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే దేశ ప్రజలకు న్యాయం జరుగుతుందని మాజీ ఎంపీ చింతామోహన్ అన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారంలో ఉన్న బీజేపీ దేశంలోని 20 బ్యాంక్‌లను 4 బ్యాంక్‌లుగా చేసిందన్నారు. ఎల్‌ఐసీ డబ్బును సైతం వాడుకున్నారని మండిపడ్డారు. ప్రధాని నరేంద్రమోదీ అమెరికా, రష్యా అధ్యక్షులతో ఫొటోలు దిగడం తప్ప దేశానికి ఒరిగిందేమీ లేదన్నారు. కూరగాయలు, గ్యాస్, పప్పులు, బియ్యం, రవాణా చార్జీలు పెరిగిపోయాయన్నారు.

సీపీఐ, సీపీఎం ఆందోళన

నెల్లూరు(బారకాసు): ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని ఎంఐసీయూ వార్డులో ఆరుగురు చనిపోయిన నేపథ్యంలో శనివారం హాస్పిటల్ సూపరింటెండెంట్ చాంబర్ వద్ద సీపీఐ, సీపీఎం నాయకులు ఆందోళన చేశారు. దామాఅంకయ్య, జగదీష్, సిరాజ్, బత్త కిష్టయ్య, కిన్నెర కుమార్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏకే నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం మధ్యాహ్నం 4 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ నెల్లూరు టౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి శనివారం తెలిపారు. ఏపీ టూరిజం, పోస్టల్ కాలనీ, సింహపురి కాలనీ, నిప్పో, పోలీస్ కాలనీ, చంద్రమౌళి నగర్, విద్యుత్ భవన్, ఎస్జీఓ కాలనీ ప్రజలు సహకరించాలని కోరారు.

వైద్య సేవలు విస్తృతం చేయాలి

నెల్లూరు రూరల్: జిల్లాలోని ప్రభుత్వాస్పత్రులు, పీహెచ్‌సీల్లో వైద్యసేవలను విస్తృతం చేయాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య ఆదేశించారు. నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో వివిధ విభాగాలకు చెందిన వైద్యులు, మానిటరింగ్ అధికారులతో సమావేశాన్ని శనివారం నిర్వహించారు. పాపులేషన్ రీసెర్చ్ సెంటర్, కేరళ వైద్య బృంద ఆధ్వర్యంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో వైద్య సదుపాయాలు, సేవలపై సేకరించిన వివరాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తెలుసుకున్నారు.

'వలంటీర్లు ఎంతో సేవ చేస్తున్నారు'

- నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్



50వ డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అనిల్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): 'వలంటీర్లు ప్రజలకు ఎంతో సేవ చేస్తున్నారు. వారిని కించపరచవద్దు.' అని నగర ఎమ్మెల్యే డాక్టర్ పి. అనిల్ కుమార్ అన్నారు. నెల్లూరు నగరంలోని 50వ డివిజన్ సంతపేట మెయిన్ రోడ్డు, బ్రాహ్మణ వీధి, ఆంజనేయ స్వామి గుడి సెంటర్ తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. డివిజన్ల అభివృద్ధి కోసం ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు ఇస్తుండడంతో వాటికి సంబంధించిన పనులు చేస్తున్నామన్నారు. ప్రతిపక్షాలు ప్రజల్లో తిరగకుండా తమపై బురద జల్లడం తగదన్నారు. కొందరు వలంటీర్ల వ్యవస్థపై నిందలు వేస్తూ, వారిపై అపోహలు కల్పిస్తూ ప్రజల్లో అపనమ్మకాన్ని సృష్టిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ గుంజి జయలక్ష్మి, ఏపీ అగ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొణిదల సుధీర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తులను కలిసిన కలెక్టర్



మానవేంద్రనాథ్‌రాయ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్



జస్టిస్ శేషసాయికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్

నెల్లూరు (దర్గామిట్ట): రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్‌ను కలెక్టర్ ఎం.హరినారాయణన్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరుకు విచ్చేసిన వారికి పుష్పగుచ్ఛం అందజేశారు.

న్యాయశాఖ ఉద్యోగుల వినతి

నెల్లూరు(లీగల్): జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్‌ను డీఆర్ ఉత్తమ్ హోటల్లో జిల్లా న్యాయశాఖ ఉద్యోగులు సంఘం నాయకులు వివిధ అంశాలపై వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నాయకులు నారాయణరెడ్డి, శివకుమార్, గిరి, గోవర్ధన్‌రెడ్డి, పోలయ్య, నరసింహారావు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణను విమర్శించడం తగదు

నెల్లూరు సిటీ: సినీ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను విమర్శించడం తగదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. నగరంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బసవతారకం కేన్సర్ హాస్పిటల్ ద్వారా వేలమంది జీవితాల్లో బాలకృష్ణ వెలుగులు నింపారన్నారు. మామిడాల మధు, కప్పిర శ్రీనివాసులు, బాలాజీ పాల్గొన్నారు.

ప్రజా సంఘ నాయకుల అరెస్ట్ దారుణం

నెల్లూరు సిటీ: కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు దుడ్డు ప్రభాకర్, అమరుల బంధుమిత్రుల సంఘానికి చెందిన శిరీషను అరెస్ట్ చేయడం దారుణమని ఉపా రద్దు పోరాట కమిటీ సభ్యులు అన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రం ఉపా, ఎన్‌ఐఏలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం

నెల్లూరు(లీగల్): రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ సేవాసదన్ భవనంలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మూడో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి తేజోవతి ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించారు. మొత్తం 61 కేసులు పరిష్కారం అయ్యాయి. లబ్ధిదారులకు రూ.3.63 కోట్లను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి వాణి తదితరులు పాల్గొన్నారు.